సాక్షి
విజయనగరం
మంగళవారం । 22 । ఆగస్టు । 2023



సమస్యల పరిష్కారం
జనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులను సమన్వయంతో పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. - 8లో



మాటిస్తే అమలు చేస్తారంతే..!
ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సాలూరు నియోజకవర్గానికి గిరిజన వర్సిటీని కేటాయించారని డిప్యూటీ సీఎం రాజన్నదొర పేర్కొన్నారు. - 8లో



దొంగల బీభత్సం
పార్వతీపురం పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రెండు ఇళ్లలో చొరబడి 21 తులాల బంగారు ఆభరణాలు, రెండు కేజీల వెండిని దోచుకుపోయారు. - 8లో

న్యూస్‌రీల్

ఐటీఐలో మిగులుసీట్లు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం
విజయనగరం అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ఖాళీగా ఉన్న వివిధ ట్రేడ్ కోర్సుల్లో మూడోవిడత ప్రవేశాలకు ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ టీవీ గిరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను 'ఐటీఐ.ఏపీ.జీఓవి.ఐఎన్' వెబ్ సైట్‌లో పొందుపరచాలన్నారు. దరఖాస్తుదారులు ఈ నెల 28న ఏదైనా ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో తప్పనిసరిగా ధ్రువీకరణపత్రాలు పరిశీలించుకోవాలని సూచించారు. వెల్డర్, ప్లంబర్, స్వీయింగ్ టెక్నాలజీ, పెయింటర్, కార్పెంటర్ ట్రేడ్‌లకు 8వ తరగతి పాసైన అభ్యర్థులు, మిగిలిన అన్ని ట్రేడ్‌లకు 10వ తరగతి పాసై ఉండాలన్నారు. ప్రభుత్వ ఐటీఐ విజయనగరంలో కంప్యూటర్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్ ట్రేడ్‌లలో మాత్రమే సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్‌లలో సీట్లు ఖాళీగా లేవన్నారు.

ఓబీసీ కమిటీ స్టడీ టూర్‌లో ఎంపీ 'బెల్లాన'



జాతీయ ఓబీసీ కమిటీ స్టడీ టూర్‌లో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: జాతీయ ఓబీసీ కమిటీ స్టడీ టూర్‌లో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్ లిమిటెడ్(బిడిఎల్)లో ఓబీసీ ఉద్యోగ సంఘాలతో ఓబీసీ రిజర్వేషన్లపై సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన పాల్గొన్నారు.

ఓటు కోసం అప్పీల్ చేసుకునే అవకాశం



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఓటర్ల జాబితా నుంచి ఓటరు పేరు పొరపాటున తొలగించబడితే ఓటరుకు అప్పీల్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి.ఎస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పౌర చట్టం 1950, సెక్షన్ 24 ప్రకారంగా జిల్లా ఎన్నికల అధికారికి అప్పీల్ చేసుకోవచ్చునని, లేదా ఫారం 6 ద్వారా సంబంధిత ఈఆర్ఓ వద్ద ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుతం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతోందని, బీఎల్ఓ ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.

23న ఆంధ్రకేసరి టంగుటూరి జయంతి
ఈ నెల 23న ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహిస్తామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయం పరిధిలోనున్న హెచ్ఓడీలు, వారి సిబ్బందితో కలిసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
పార్వతీపురం: ఉపాధ్యాయులు గురుపూజోత్సవం (సెప్టెంబర్ 5) సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలలో పనిచేస్తున్న అర్హతగల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులకు 15 సంవత్సరాల సర్వీసు ఉండి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొంది ఎలాంటి క్రమ శిక్షణ చర్యలులేని ఉపాధ్యాయులు అవార్డులకు అర్హులని తెలిపారు. ఈ నెల 22వ తేదీలోగా డీఈఓ కార్యాలయానికి దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

ఆర్తాం-గదబవలసలో గజరాజులు



ఆర్తాం-గదబవలస గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న గజరాజుల గుంపు

కొమరాడ: మండలంలోని ఆర్తాం-గదబవలస పొలాల్లో ఏడు ఏనుగుల గుంపు సంచరిస్తుండగా, ఒంటరి ఏనుగు నాగావళి నది ఆవల ఉన్న నిమ్మలపాడు పరిసరాల్లో ఉంది. ఆర్తాం నుంచి కల్లికోట, దుగ్గి, గుణానపురం గ్రామాలకు వెళ్లేవారు రాత్రిపూట ప్రయాణం చేయవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అత్యవసర వేళ బయటకు వెళ్లేవారు ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను సంప్రదించాలన్నారు. ఒంటరి ఏనుగును కవ్వించవద్దని సూచించారు.



సర్కారు బడుల్లో డిజిటల్ బోధన

డిజిటల్ బోధనతో ఉత్తమ ఫలితాలు



ఐఎఫ్‌పీ, స్మార్ట్‌టీవీలు, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల సాయంతో కూడిన బోధన వల్ల పాఠశాల విద్యలో మంచి ఫలితాలు సాధించవచ్చు. విద్యార్థులకు ఎంతటి కఠిన పాఠ్యాంశాలైనా సులభంగా అర్థమవుతాయి. అవగాహన కలుగుతుంది. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంచుతాయి. ఈ విధానంతో భవిష్యత్తులో ఉత్తమ ఫలితాలు వస్తాయి. శ్రద్ధగా పాఠాలు వినడంతోపాటు కొత్త అంశాలను నేర్చుకునేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతారు.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

- బిగ్ స్క్రీన్‌లపై అర్థవంతమైన బోధన
- తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు
- ఈ ఏడాది ప్యానెల్స్ ఏర్పాటుకు 768 ప్రభుత్వ స్కూళ్ల ఎంపిక
- 1,14,431 మంది విద్యార్థులకు ప్రయోజనం
- జిల్లాకు 2,635 ఐఎఫ్‌పీలు, 755 స్మార్ట్ టీవీల కేటాయింపు
- తొలిడతగా ఐఎఫ్‌పీలు 1,327, స్మార్ట్ టీవీలు 355 రాక
- వీటి వినియోగంపై ఇప్పటికే 6,611 మంది ఉపాధ్యాయులకు శిక్షణ
- డిజిటల్ బోధనతో ఉత్తమ ఫలితాలు: డీఈఓ

విజయనగరం అర్బన్: ప్రభుత్వ బడులు రోజురోజుకూ బలోపేతమవుతున్నాయి. నాడు కనీసం మరుగుదొడ్లకు నోచుకోని పాఠశాలలు నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషితో సకల సదుపాయాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్నాయి. ప్రమాణాలతో కూడిన విద్యాబోధన అందిస్తున్నాయి. పేదకుటుంబాల పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్నాయి.

నాడు–నేడు అనేలా...
మనబడి నాడు–నేడు కింద విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, విజ్ఞానం పంచే బొమ్మలతో కూడిన తరగతి గదులు, గ్రీన్‌చాక్‌బోర్డులు, తాగునీటి ప్లాంట్లు, పలకలతో కూడిన గచ్చులు.. పచ్చని చెట్లతో సరస్వతీనిలయాలను ప్రభుత్వం ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతోంది. ప్రస్తుత సాంకేతిక ప్రగతిని సర్కారు బడుల విద్యార్థులకు చేరువచేసేలా డిజిటల్ తరగతుల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. పాఠ్యాంశబోధనకు అవసరమైన పరికరాలను సమకూర్చుతోంది. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) ఏర్పాటు చేసి విద్యార్థులకు దృశ్య, శ్రవణ పద్ధతుల్లో సరికొత్త బోధనను అందుబాటులోకి తెచ్చింది.

జిల్లాలో 1,14,431 మందికి ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలతో బోధన
విజయనగరం జిల్లాలో 768 ప్రాథమి, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 2,635 ఐఎఫ్‌పీ, 755 స్మార్ట్ టీవీలు ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీటివల్ల 1,14,431 మంది విద్యార్థులకు డిజిటల్ బోధన చేరువకానుంది. ఇందులో భాగంగా మొదటి విడతలో 1,327 ఐఎఫ్‌పీలు, 355 స్మార్ట్ టీవీలను కేటాయించింది. ప్రసుతం వీటిని ఆయా స్కూళ్లలో ఏర్పాటుచేయడంతో డిజిటల్ తరగతులు కొనసాగుతున్నాయి. రెండో విడతలో మరో 1,308 ఐఎఫ్‌పీలు, 400 స్మార్ట్ టీవీలు విడుదల చేయాలని నిర్దేశించింది. వీటి ఏర్పాట్లలో జిల్లా విద్యాశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. విద్యార్థులు సులభంగా పాఠ్యాంశాలను అర్థం చేసుకునేందుకు డిజిటల్ తరగతులు దోహదపడతాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు స్మార్ట్ టీవీలు, మూడు నుంచి 10వ తరగతి వరకు ఐఎఫ్‌పీల ద్వారా బోధన సాగుతోంది. ఇప్పటికే జిల్లాలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఉచితంగా అందజేసింది. స్మార్ట్ టీవీలకు ఇంటర్‌నెట్ అనుసంధానం చేసి, ఐఎఫ్‌పీలకు యూట్యూబ్‌ను కనెక్టుచేసి పాఠ్యాంశాలను బోధిస్తున్నారు. వీటిని చూస్తున్న విద్యార్థులు పలు అంశాలను సులభంగా నేర్చుకుంటున్నారు. విద్యార్థులు అవసరమనుకున్న అంశాలను ఫైల్ రూపంలో సేవ్ చేసుకుని అవసరం ఉన్నప్పుడు తిరిగివినే అవకాశం ఉంటుంది. ఈ విధానం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీపడి ఉత్తమ ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని విద్యావేత్తలు చెబుతున్నారు.



ఐఎఫ్‌పీలపై శిక్షణలో ఉపాధ్యాయులు

ఐఎఫ్‌పీతో ఉపయోగాలు ఇవే..
- ఐఎఫ్‌పీతో దృశ్య శ్రవణ, ఇంటరాక్టివ్‌తో కూడిన 2డీ, 3డీ యానిమేటర్ కంటెంట్ బోధన అందుతుంది.
- విద్యార్థికి సులభంగా అవగాహన, కఠినమైన భావనలను సరళీకృతం చేసి బోధించేందుకు ఉపయోగపడుతుంది. ఉదాహరణకు గుండె గురించి విద్యార్థులకు బోధించే సమయంలో నేరుగా గుండె పనిచేసే విధానం, వీడియో, ఆడియో రూపంలో చూపించడం వల్ల విద్యార్థులకు సులభంగా అర్థమవుతుంది.
- ప్రపంచ స్థాయిలో పోటీపడే లక్ష్యంతో విద్యార్థులను తీర్చిదిద్దడానికి సహాయపడుతుంది.
- జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించేలా నాణ్యమైన విద్యను అందించేందుకు బైజూస్‌తోపాటు ఎన్‌సీఈఆర్‌టీ వారు పాఠ్యాంశ ప్రణాళిక రూపొందిస్తున్నారు.



ఐఎఫ్‌పీ వినియోగంపై విద్యార్థులకు నేర్పుతున్న టీచర్

ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ
ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన కోసం 6,611 మంది ఉపాధ్యాయులకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు శిక్షణ ఇచ్చారు. తగరపువలస అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 1,204 మందికి, గరివిడి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో 1,178 మందికి, జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాలో 275, లెండీ ఇంజినీరింగ్ కళాశాలలో 1,995 మందికి, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 1,261 మందికి, సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 698 మందికి ఒక్కొక్కరికీ రెండు రోజుల చొప్పున 14 రోజుల పాటు శిక్షణ తరగతులను ఉన్నత విద్యామండలికి చెందిన సబ్జెక్టు నిపుణులతో నిర్వహించారు.

జెడ్పీ చైర్మన్‌కు అరుదైన ఆహ్వానం



జాతీయస్థాయి వర్క్‌షాప్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో జెడ్పీ చైర్మన్ల ప్రతినిధిగా మజ్జి శ్రీనివాసరావు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పంచాయతీరాజ్ వ్యవస్థలో సుపరిపాలన అంశంపై జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో సోమవారం నుంచి ప్రారంభమైన మూడురోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్‌కు విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) హాజరయ్యారు. రాష్ట్రంలోని జెడ్పీ చైర్మన్లందరి తరఫున ఆయన ప్రాతినిధ్యం వహించారు. వాస్తవానికి ఈనెల 25వ తేదీన ఉమ్మడి విజయనగరం జిల్లాలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు ఏర్పాట్ల బాధ్యతల్లో తలమునకలై ఉన్నప్పటికీ ఆదివారం రాత్రి హుటాహుటిన ఢిల్లీ వెళ్లారు. సోమవారం ఉదయం అక్కడి నుంచి శ్రీనగర్‌కు చేరుకున్నారు. సుపరిపాలనతో సుస్థిరాభివృద్ధి సాధన, ప్రజలకు మెరుగైన పాలన, అందుబాటులో విద్య, వైద్య సదుపాయాలు తదితర అంశాలపై జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. అనంతరం కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను, ఆ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులను కలిశారు. మన రాష్ట్రం తరఫున ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న బృందంలో జెడ్పీ చైర్మన్‌తో పాటు ఇటీవల వరకూ కలెక్టర్‌గా సేవలందించిన ఎ.సూర్యకుమారి కూడా ఉన్నారు.

తాటాకులే భోజన ప్లేట్లు



ఎల్.కోట మండలం రెల్లిగౌరమ్మపేట సమీపంలో తాటాకు దొప్పల్లో భోజనాలు చేస్తున్న గొర్రెల కాపరులు

జీవాల పెంపకందారుల జీవనం ప్రకృతితో మమేకం. ఎండైనా.. వానైనా పొలమే వారి ఆవాసం. జీవాల పెంపకమే జీవనాధారం. ఇప్పటికీ తాటాకులే వారి భోజన ప్లేట్లు. దొప్పలుగా మలిచిన తాటికమ్మల్లో అన్నం వడ్డించుకుని అంతా కలిసి ఆనందంగా భుజిస్తారు. సంచార జీవితంలో వంటపాత్రలు మోయడం భారంకావడం, ప్లాస్టిక్ వినియోగించి పొలంలో విసిరేస్తే పుడమితల్లికి నష్టం కలుగుతుందన్న జిజ్ఞాసతో తాటికమ్మలనే ఇప్పటికీ భోజన పేట్లుగా వినియోగిస్తున్నారు. వారి పర్యావరణ పరిరక్షణ ఆలోచనను అందరూ అభినందించాల్సిందే.

– లక్కవరపుకోట

26న జీడీఏ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్
విజయనగరం ఫోర్ట్: జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏ) పోస్టులకు ఎంపికైన వారికి ఈ నెల 26న ఉదయం 9.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) బి.గౌరీశంకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులందరూ తమ ఒరిజనల్ విద్యార్హత ధ్రుపత్రాలు, జెరాక్సు కాపీలు తీసుకురావాలన్నారు.

గిరిజన వర్సిటీ శంకుస్థాపనకు పక్కా ఏర్పాట్లు



ముఖ్యమంత్రి సభా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

దత్తిరాజేరు: మెంటాడ మండలం కుంటినివలస వద్ద ఈ నెల 25న జరగనున్న కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు పక్కాఏర్పాట్లు చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ అధికారులను ఆదేశించారు. శంకుస్థాపనకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి, కేంద్ర విద్యాశాఖమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రానున్నారని, ఆ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వర్సిటీ శంకుస్థాపన స్థలంతో పాటు దత్తిరాజేరు మండలం మరడాం గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఏర్పాటుచేసే సభావేదిక, హెలిప్యాడ్ స్థలాన్ని ఆమె సోమవారం పరిశీలించారు. సభకు హాజరయ్యే వీవీపీలతో పాటు ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కుంటినవలస వద్ద విశ్వవిద్యాలయ శంకుస్థాపన శిలాఫలకం ఏర్పాటు, వాహనాల పార్కింగ్ ప్రదేశం పనులపై ఆరా తీశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్న నాలుగు కిలోమీటర్ల రోడ్డు పనులను పరిశీలించారు. సమయం తక్కువగా ఉన్నందున పనులు వేగవంతం చేయాలని రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ వెంకటరావును ఆదేశించారు. సభావేదిక వద్ద వైద్యశిబిరాలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి భాస్కరరావుకు సూచించారు. విద్యుత్, తాగునీటి సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్థానిక అధికారులకు సూచించారు. గిరిజన విశ్వవిద్యాలయం వివరాలను తెలియజేస్తూ సమగ్ర వివరాలతో ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. వర్షం కురిసినా సభకు ఎటువంటి ఇబ్బంది రాకుండా షామియానాలను వేయాలని సూచించారు. కుంటినవలస గ్రామం వద్ద దేవుడమ్మ, రమణ, సూరమ్మ, సింహాచలం తదితరులు పంట పొలాల్లో ఉన్న చెట్లకు, డీ పట్టా భూములకు సంబంధించిన కొంత నగదు అందలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ రెండురోజుల్లో రూ.75 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేస్తామని, ఇంకా ఎవరైనా భూమిలిచ్చిన రైతులు ఉంటే వారిపేర్లు సేకరించాలని మెంటాడ తహసీల్దార్ రామకృష్ణను ఆదేశించారు. ఆమె వెంట జేసీ మయూర్‌అశోక్, బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ, సీఐలు అప్పలనాయుడు, విజయనాథ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రోగులకు ఆరోగ్య ఆసరా



గత నాలుగునెలల్లో ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డుల మంజూరు ఇలా..

నెల	అందించిన హెల్త్ కార్డుల సంఖ్య
ఏప్రిల్	5,996
మే	6,292
జూన్	6,386
జూలై	8,913



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు చప్ప సత్యనారాయణ. జామి మండలం విజినిగిరి గ్రామం. కొద్ది రోజుల కిందట కడుపునొప్పి రావడంతో విజయనగరంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసుకున్నారు. అతనికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద డిశ్చార్జి అయినరోజు అతని బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం రూ.4500 జమ చేసింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఎం.రామునాయుడు. బొబ్బిలి మండలం అలజంగి గ్రామం. గాలిబ్లేడర్‌లో రాళ్లు ఉండడంతో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసుకున్నారు. డిశ్చార్జి అయినరోజు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద ఆయన ఖాతాకు రూ.4 వేలను ప్రభుత్వం జమ చేసింది.

- చికిత్స అనంతరం రోగి కోలుకునేవరకు ఆర్థిక సాయం
- 2022 ఏప్రిల్ నుంచి 2023 జూలై వరకు జిల్లాలో 79,175 మందికి లబ్ధి
- రూ.39 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆసరా పథకాలు రోగులకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా శస్త్రచికిత్సలు, వైద్యసేవలు పొందిన రోగులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా కింద ఆర్థిక సాయం అందజేస్తోంది. చికిత్సానంతరం రోగులు కొన్నాళ్లపాటు పనులు చేసుకోలేరు. కుటుంబ పోషణ భారంగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆరోగ్య ఆసరా కింద చికిత్సానంతరం రోగికి జీవన భృతిని అందజేస్తోంది. ఈ డబ్బులతో ఆరోగ్యకర ఆహారం తీసుకునేందుకు ఉపయోగపడుతున్నట్టు రోగులు చెబుతున్నారు.

- జిల్లాలో అధికశాతం మంది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే. 95 శాతానికి పైగా చిన్న కుటుంబాలే. ఇంటి పెద్దకు ఏదైనా కష్టంవస్తే ఆ ఇల్లు గడవడం చాలా కష్టమవుతుంది. అంతేకాకుండా ఇంటి పెద్దను కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులు పనికి వెళ్లకుండా సపర్యలు చేయడంలో నిమగ్నమవుతారు. ఇటువంటి పరిస్థితుల్లో కొందరు రోగులు తినడానికి తిండి లేక పస్తులుండే పరిస్థితి. అటువంటి వారికి ఆసరా ఎంతోగానో ఉపయోగపడుతోంది. రోజుకి రూ.225 చొప్పున నెలకు రూ. 5వేలు వరకు ప్రభుత్వం భృతికల్పిస్తోంది.

రూ.39 కోట్ల ప్రయోజనం
ఆరోగ్య ఆసరా కింద 2022 ఏప్రిల్ నుంచి 2023 జూలై నెలఖారు వరకు వైద్యసేవలు పొందిన విజయనగరం జిల్లాలోని 79,175 మంది రోగుల ఖాతాలకు రూ.39 కోట్లను ప్రభుత్వం జమచేసింది. 2022–23లో 59,352 మందికి రూ.29.61 కోట్లు, 2023–24లో 19,823 మంది రోగులకు రూ.9.43 కోట్లను ఆరోగ్య ఆసరా కింద అందించింది. మరోవైపు కొత్త కుటుంబాలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను అందజేస్తోంది. గత నాలుగు నెలల్లో జిల్లాలోని 27,587 మందికి ఆరోగ్యకార్డులు మంజూరు చేసింది.



పట్టణంలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

క్లుప్తంగా

ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లు భర్తీ

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మిగులు సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ సోమవారం ఓ ప్రక టనలో తెలిపా రు. ఐటీఐ.ఎన్‌ఐసీ.ఇన్‌లో ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28న ఒరిజినల్ ధ్రువీక రణ పత్రాలతో కళాశాలకు వచ్చి వెరిఫికేషన్ చేయించుకోవాల ని, 30న కౌన్సెలింగ్ జరుగు తుందని, అప్పుడు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసు కురావాలని వివరించారు.

స్నేహితుని కుటుంబానికి అండ



శేషాచార్యుని భార్యకు నగదు అందజేస్తున్న 1988-89 బ్యాచ్ విద్యార్థులు

వీరఘట్టం: ఇటీవల మృతి చెందిన స్థానికుడైన మిత్రుడు కండల శేషాచార్యుడు కుటుంబానికి ఆయనతో పాటు వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదోతరగతి వరకు చదువుకున్న 1988–89బ్యాచ్ మిత్రులు అండగా నిలిచారు. ఈ మేరకు రూ. 1.85లక్షలను పోగుచేసి మిత్రుని భార్య లక్ష్మికి రూ.1 లక్ష, మృతుడి సోదరుడికి రూ.50 వేలు అందజేశారు. మరో రూ.35 వేలను వారి అవసరాల నిమిత్తం బ్యాంకులో డిపాజిట్ చేశారు. మిత్రుడు మర ణించడంతో ఆ కుటుంబానికి అండగా నిలిచిన 1988–89 బ్యాచ్ పూర్వపు విద్యార్థు లను స్థానికులు అభినందించారు.

యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన చంద్రశేఖర్

పార్వతీపురం: వర్తన మార్చుకోకపోతే చనిపో తానని చెప్పిన భర్త యాసిడ్ తాగి ఆత్మహ త్యకు పాల్పడ్డాడు. సోమవారం జరిగిన ఈసంఘటనపై పార్వతీపురం ఆస్పత్రి అవు ట్‌పోసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పదోవార్డుకు చెందిన పి. చంద్ర శేఖర్(30)కు భార్యతో తరచూ గొడవలు జరు గుతున్నాయి. నీ ప్రవర్తన సక్రమంగా లేక పోతే చనిపోతానని భార్యతో చంద్రశేఖర్ చెప్పినప్పటికీ ఆమె పెడచెవిన పెట్టడంతో పాటు చచ్చిపో అని అనడంతో మనస్తాపం చెంది యాసిడ్ తాగాడు. ఈ మేరకు చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యం చేస్తుండగా మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..

విజయనగరం క్రైమ్: గుర్ల మండలానికి చెం దిన వెంపడాపు వెంకటలక్ష్మి (20) అనుమా నాస్పద స్థితిలో సోమవారం మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ పోలీసు లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.
రెండేళ్ల క్రితం గరివిడి మండలానికి చెందిన చిన్నతో వెంకటలక్ష్మికి పెళ్లయింది. వృ త్తిరీత్యా విజయవాడలో రియల్ ఎస్టేట్ పను లకు భర్త వెళ్లిపోయాడు. దీంతో అలకానంద కాలనీలో అపార్ట్‌మెంట్ వాచ్‌మన్‌గా విధు లు నిర్వహిస్తున్న తల్లిదండ్రుల వద్దనే వెంక టలక్ష్మి ఉంటోంది. అపార్ట్‌మెంట్‌లో పైగది ఖాళీగా ఉండడంతో అక్కడ కుట్టుపనిచేసు కుంటూ జీవనం సాగిస్తోంది. యథావిధిగా సోమవారం మధ్యాహ్నం భోజనం చేసి పైకి వెళ్లింది. సాయంత్రం ఇంటికి రావాల్సిన మనిషి రాకపోవడంతో తల్లి పైకి వెళ్లి చూడ గా గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించింది. స్థానికుల సాయంతో కిందికి దించినప్పటికీ ఫలితం లేకపోయింది. మృతురాలి తల్లిదం డ్రుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై మురళి వచ్చి పరిశీ లించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్

- అధికారులకు కలెక్టర్ ఆదేశాలు
- పెండింగ్ వినతులపై సమీక్ష

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్ర మానికి మునిసిపాలిటీల పరిధిలో వచ్చిన వినతుల పరిష్కారంపై ఆయా ప్రత్యేక అధికారులు అన్ని శాఖలతో సమావేశమై సమన్వయంతో, ప్రజలు సం తృప్తి చెందే రీతిలో పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. రెవెన్యూ, మునిసిపల్, పోలీసు వంటి శాఖలు ఉమ్మడిగా పరిష్కరించాల్సిన సమస్యలను ఆయా శాఖల అధికారులు ప్రత్యే కాధికారి ఆధ్వర్యంలో కలిసి చర్చించి ఏ విధంగా పరిష్కరించాలో నిర్ణయించాలని సూచించారు. జగ నన్నకు చెబుదాంలో పరిష్కరించిన విధానంపై గత వారంలో ఆయా అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తం కావడంతో ఆయా వినతులపై జేసీ మయూర్ అశోక్ జిల్లా అధికారులతో కలెక్టర్ నాగల క్ష్మి, సోమవారం సమీక్షించారు. గృహనిర్మాణ, పం చాయతీరాజ్, మండలపరిషత్, పురపాలక శాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, విద్యుత్ పంపిణీ సం స్థ, పోలీసుశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, రిజిస్ట్రేషన్ల శాఖ, విభిన్న ప్రతిభావంతుల శాఖ, రెసిడెన్షియల్ పాఠశాలల సొసైటీ, ఇంటర్మీడియట్ బోర్డు, విద్యా, జలవనరుల శాఖ పరిధిలో అసంతృప్తి వ్యక్తమైన వినతులపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు ఎం.లావణ్య, సులోచనరాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు 214 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల కార్యక్రమానికి 214 విన తులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబం ధించి అత్యధికంగా 145, ఆస్పత్రి సేవలకు సంబం ధించి 4, తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థకు 2, వైద్య ఆరోగ్య శాఖకు 5, పంచాయతీ రాజ్ శాఖకు 10, హౌసింగ్ 8, మున్సిపల్ 4, డీఆర్‌డీఏ 11, గ్రామ వార్డు సచివాలయం శాఖకు 25 వినతులు అం దాయి. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు వినతులు స్వీకరిం చారు. ఆయా వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదే శించారు.



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

ఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలి

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చే ఫిర్యాదు లపై అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని జిల్లా పోలీసు అధికారులకు ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా బాధితుల నుంచి 36 ఫిర్యాదులు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, బాధితులకు న్యాయమం దించాలని సూచించారు. కార్యక్రమంలో అద నపు ఎస్పీ అస్మా ఫర్హీన్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పార్వతీపురం: అర్జీదారుల సమస్యలను పరిష్కరిం చాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, డీఆర్‌ఓ జె.వెంకటరావులు వివిధ గ్రామాలనుంచి వచ్చిన వారి నుంచి సామా జిక, వ్యక్తిగత అంశాలపై 110 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఒ. ప్రభాకరరావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ కె.విజయ గౌరి, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ ఎం.డి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సత్వర న్యాయం



ఫిర్యాదు దారులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: బాధితులు అందజేసే ఫిర్యాదు లకు సత్వర న్యాయం జరగాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన నేరుగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుం చి ఫిర్యాదులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. వేధింపులు, కుటుంబకలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్య లపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృ షి చేయాలని సూచించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాలి స్న పరిస్థితులు ఉండకూడదని, బాధితులకు చట్టప రిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసు కుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై వచ్చిన ఫిర్యాదులపై స్పందించి అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రజలకు సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా ఆన్‌లైన్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడ బ్ల్యూ.సైబర్‌క్రైమ్.ఇన్ ద్వారా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో టోల్ ఫ్రీ నంబర్ 1930కు ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్ కిరణ్, ఎస్‌బీసీఐ, సీహెచ్.ల క్ష్మణ రావు, డీసీఆర్‌బీ సీఐ ఎన్ వీ ప్రభాకర్ రావు, ఎస్సై పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల బీభత్సం

- 21 తులాల బంగారు ఆభరణాల చోరీ
- కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



అడ్వకేట్ ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

పార్వతీపురంటౌన్: పట్టణంలో దొంగలు బీభత్సం సృష్టించారు. రెండు ఇళ్లల్లో 21 తులాల బంగారు, రెండు కేజీల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వివ రాలిలా ఉన్నాయి. పట్టణంలోని సౌందర్య థియేటర్ వెనుక ఉన్న సౌందర్యనగర్ కాలనీలో అడ్వకేట్ నీలం రాజేశ్వరరావు ఈనెల 17వ తేదీన కుటుంబస మేతంగా తిరుపతి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లారు. దర్శనం చేసుకుని 21న పార్వతీపురంలోని ఇంటికి చేరుకుని పగులగొట్టి ఉన్న తలుపులను చూసి కంగుతిన్నారు. ఇంటిలోకి వెళ్లి చూసేసరికి బీరువాలు, అలమరాలు పగులగొట్టి ఉండడంతో పరిశీలించి ఇంట్లో ఉన్న బంగారు, వెండి ఆభర ణాలు దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అలాగే పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన ఓ వ్యక్తి ఇంటిలో తులం బంగారం, పది తులాల వెండి వస్తువులు చోరీ గురైనట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఫిర్యాదులపై క్లూస్‌టీం సంఘటనా స్థలాలకు వచ్చి ఆధారాలు సేకరించింది. పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు ఫిర్యాదులపై కేసులు నమోదు చేశారు.

సీతామాంబపురంలో..

కొమరాడ: మండలంలోని గుమడ పంచాయతీ సీతామాంబపురం గ్రామంలో పట్టపగలు చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మోటార్ సైకి ల్స్‌పై ఇద్దరు మగవారు ఇద్దరు ఆడవారు చిన్న బాబును తీసుకుని వచ్చి గ్రామంలో తిరుగుతు న్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన మడక జోగి నాయుడు ఇంట్లో ఎవరూ లేనట్లు పసిగట్టి చెట్టుకింద ఒక మహిళ కాయలు కోస్తున్నట్లు నటిం చింది. మరో మహిళ జోగినాయుడు ఇంట్లో దూరి వారి వద్ద ఉన్న తాళాలతో ఇల్లు, బీరువా ఓపెన్ చేసి రూ. 50 వేలు, ఐదు గ్రాముల బంగారం చోరీ చేసింది. ఆ ఇంటి దగ్గరలో ఉన్నవారు కేకలు వేసేస రికి తాము కుంకుమ అమ్మడానికి వచ్చామని చెప్పి పారిపోయారు. ఈ సంఘటనపై ఎస్సై జగదీష్ నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాటిస్తే అమలు చేస్తారంతే..!

- సాలూరు నియోజకవర్గానికి గిరిజన యూనివర్సిటీ
- శంకుస్థాపనకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: నాడు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తూ సాలూరు నియోజకవర్గానికి కేంద్రియ గిరిజన యూనివ ర్సిటీని కేటాయించారు. వర్సిటీ శంకుస్థాపనకు కేం ద్ర విద్యాశాఖామంత్రి ధర్మేంద ప్రధాన్‌తో కలిసి ఈ నెల 25న మెంటాడ మండలానికి వస్తున్నారని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో కేంద్రియ గిరిజన యూనివర్సిటీని గిరిజనేతర కొత్తవలస వద్ద రెల్లకు తరలించారని గుర్తుచేశారు. గిరిజన ప్రాంతం లోనే గిరిజన యూనివర్సిటీ ఉండాలని నాడు జగన్ మోహన్‌రెడ్డి చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాట ప్రకారం, కేంద్రంతో మాట్లాడి సాలూరు గిరిజన నియోజకవర్గంలోనే ఏర్పాటుకు కేంద్రియ గిరిజన యూనివర్సిటీని కేటాయించార న్నారు. ఈ యూనివర్సిటీ వల్ల గిరిజనులు అధికం గా ఉన్న ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలవారికి ఎంతో సదుపాయంగా ఉంటుంద న్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పక్కాగా ఏర్పాట్లు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 25న నియోజకవర్గంలోని మెంటాడ మండలంలో కేం ద్రియ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు వస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ శాఖల జిల్లా స్థాయి ముఖ్య అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి సమావేశానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్న నేప థ్యంలో ప్రత్యేక బస్సులు, ట్రాఫిక్ తదితర అంశా లపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. గిరిజన సంప్రదాయాలు ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్ర మాలు నిర్వహించాలని సూచించారు. సమావేశం లో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, డీఆర్‌ఓ జె.వెంకటరావు, డ్వామా పీడీ రామచంద్ర రావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఆర్‌టీఓ మల్లికార్జున్ రెడ్డి, ఐటీడీఏ ఈఈ శాంతేశ్వరరావు, డీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, సీఐలు శ్రీనివాసరావు, ధనుంజయనాయుడు తదిత రులు పాల్గొన్నారు.

కారు బోల్తా: నలుగురికి గాయాలు



బోల్తా పడిన కారు

వీరఘట్టం: వీరఘట్టం-పాలకొండ సీఎస్‌పీ రహ దారిలో చిదిమి జంక్షన్ వద్ద సోమవారం ఓ కారు బోల్తా పడింది. ప్రమాదం జరిగిన తీరును పరిశీలిం చిన వారంతా పెనుప్రమాదం జరిగి ఉంటుందని ఊహించారు. అయితే అదృష్టవశాత్తు కారులో ఉన్న నలుగురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయ టపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వీర ఘట్టం మండలం వెంకమ్మపేట నుంచి పట్టణం లోకి వస్తున్న కారు ప్రమాదానికి గురైంది.

లారీ ఢీ కొని వ్యక్తికి..

రామభద్రపురం: మండలకేంద్రంలో సోమవారం వేకువజామున లారీ ఢీ కొని ఓ వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. మండలకేం ద్రంలోని చొక్కాపు వీధికి చెందిన గంట అప్పల నాయుడు వేకువజామున 4.30 గంటల సమయం లో టీ తాగేందుకు జంక్షన్‌కు వెళ్తున్నాడు. ఇంతలో విశాఖపట్నం నుంచి రామభద్రపురం మీదుగా బొబ్బిలి వెళ్తున్న లారీ మితిమీరిన వేగంతో వస్తూ టీబీఆర్ థియేటర్ సమీపంలో అప్పలనాయుడిని బలంగా ఢీకొట్టి రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బల మీదకు ఈడ్చుకెళ్లింది. దీంతో లారీ, మట్టిదిబ్బల మధ్యలో ఉండిపోయిన బాధితుడిని బయటకు తీయడానికి సుమారు రెండు గంటల పాటు శ్రమిం చాల్సి వచ్చింది. బయ టకు తీసిన తరువాత ప్రథమ చికిత్స బాడంగి సీహెచ్‌సీలో చేయించి మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తర లించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సురేంద్రనాయుడు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పలనాయుడు

ఘరానా దొంగ అరెస్ట్

- బంగారం, వెండి రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న సబ్ డివిజనల్ డీఎస్పీ ఆర్.గోవిందరావు (ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: పట్టణ పరిధిలో 12 ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన ఘరానా దొంగను పోలీసులు అరెస్ట్ చేసి, 27 తులాల బంగారు ఆభర ణాలు, ఆరు కిలోల వెండిని స్వాధీనం చేసుకు న్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమ వారం నిర్వహించిన సమావేశంలో సబ్ డివిజన్ డీఎస్పీ ఆర్.గోవిందరావు వివరాలు వెల్లడించారు. మెంటాడ మండలం కొప్పంగి గ్రామానికి చెందిన కె.శ్రీనివాసరావు గతంలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ గా పదేళ్లపాటు పనిచేసి, ఉద్యోగం మానేసి, చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఏడాది కాలంగా విజయనగరం పట్టణంలోని ఉడాకాలనీ, బాబామె ట్ట ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నాడు. దీంతో బాధితుల ఫిర్యాదుమేరకు ఎస్పీ ఆదేశాలతో నిందితుడ్ని పట్టుకునేందుకు వన్‌టౌన్ సీఐ బి.వెంక టరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం సాలిపేట జంక్షన్ గురజాడ పబ్లిక్ స్కూల్ రోడ్డులో నిందితుడు శ్రీనివాసరావు పట్టుబడ్డాడని డీఎస్పీ తెలిపారు. విచారణలో నిందితుడు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉడాకాలనీ ఫేజ్–1, 2, ,3, అల కానందకాలనీలో ఏడు నేరాలు, విజయనగరం టూటౌన్ పరిధిలో రింగురోడ్డు, బాబామెట్ట ప్రాం తాల్లో ఐదు నేరాలకు పాల్పడినట్లు చెప్పాడని తెలి పారు. గతేడాది కాలం నుంచి నిందితుడు పట్టణం లో 12 నేరాలకు పాల్పడగా, నిందితుడి నుంచి రూ. 25 లక్షలు విలువ చేసే 27 తులాల బంగారు ఆభర ణాలు, ఆరు కిలోల వెండి వస్తువులను , దొంగతనం చేసేందుకు వినియోగించే పనిముట్లను కూడా రిక వరీ చేసి, నిందితుడ్ని రిమాండ్‌కు పంపించామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు ఛేదనలో క్రియాశీలకంగా పనిచేసిన వన్ టౌన్ సీఐ బి.వెంక టరావు, ఎస్సై వి.అశోక్ కుమార్, హెచ్‌సీ ఎం.అచ్చిరాజు, కానిస్టేబ ల్స్ టి.శ్రీను, బి.శివ, బి.శంకరరావు, ఎస్.గౌరీశంక ర్‌లను ఎస్పీ ఎం.దీపిక అభినందించారు. సమావే శంలో టూటౌన్ సీఐ ఎన్‌హెచ్.విజయానంద్, ఎస్సై ఎస్.భాస్కరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొ న్నారు.

డీవీజీ శంకరరావుకు ఆత్మీయ స్వాగతం



డీవీజీ శంకరరావుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, స్నేహితులు

సాలూరు: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులై,తొలిసారిగా స్వగ్రామ మైన సాలూరు మండలంలోని పాలికవలసకు వచ్చిన డీవీజీ శంకరరావుకు గ్రామస్తులు, కుటుంబసభ్యులు, స్నేహితులు ఆత్మీయ స్వాగతం పలికారు. సోమవారం గ్రామానికి వచ్చిన ఆయనకు పూలమాలలు వేసి,హారతులు పట్టి అభినందనలు తెలిపారు. డీవీజీకి ఈ పదవి కట్టబెట్టినందుకు గ్రామస్తు లు ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి, గిరిజనసంక్షే మశాఖామంత్రి పీడిక రాజన్నదొరలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ముఖ్యమంత్రి ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని డీవీజీ శంక రరావు ఈ సందర్భంగా అన్నారు.

ఎన్‌సీఎస్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకోవాలి

- జిల్లా రైతు సంక్షేమ సంఘం డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నిరసనలో రైతు సంఘాలు

విజయనగరం అర్బన్: బొబ్బిలి దగ్గరున్న ఎన్‌సీఎస్ సుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తెరిపించాలి. అలాగే భీమసింగి చెరకు ఫ్యాక్టరీని మళ్లీ ప్రారంభించాలని జిల్లా రైతు సంక్షేమ సంఘం, జిల్లా రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ బి.రాంబాబు డిమాండ్ చేశారు. జిల్లా రైతు సంక్షేమ సంఘం, జిల్లా రైతు సంఘాల సంయుక్త నిర్వహణలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఈ మేరకు పేర్కొన్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిచి రైతులను ఆదు కోవాలని కోరారు. రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మినాయుడు, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు దేవుడు బాబు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380–00
బంగారం(22సి. 10గ్రా.)	55,350–00
వెండి (కిలో)	80,000–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹116	₹202	₹ 212